శ్రీరస్తు

శుభమస్తు    అవిఘ్నమస్తు



# సత్యసాయీ!
# నీవె సద్బోధకుడవు

## మంజరీ ద్విపదలో నీతి శతకము
## తాత్పర్య సహితము

రచన

**అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు**
M.Tech.



## ముందుమాట

చెడు వినవద్దు, చెడు కనవద్దు, చెడు అనవద్దు. ఇదే మేలు కొలుపు. మన గాంధీజీ పిలుపు. అనే ఒక మంచి పాటవుంది. అది నీతి. అయితే ఒక మనిషిని ఒంటరిగా ఉంటే ఇది సాధించవచ్చునేమో. తపోనిష్ఠులు ఒంటరిగా చేసేది ఇందుకే. దీనిని మించి ఇంకొకటుంది. చెడు తలవద్దు. ఈ తలచేది ఎవరు? బుద్ధి. అది ఎక్కడుంది? ఎలా వుంది? తెలియదు. మెదడు అని పొరబడవద్దు. బుద్ధి, మెదడు వేరు సుమా. అతి క్రూరుడైన దుష్టునికి అపరిమితమైన తెలివి ఉండవచ్చు. మనం మాట్లాడుతున్నది బుద్ధిమంతుడి గురించి మేధావి గురించి కాదు.

గాంధీగారు మహాత్ముడు ఎలా అయ్యారు. ఈ చెడు తలపుని నిర్మూలించి ఒక గమ్యం (స్వాతంత్ర్య సాధన)తో పయనించారు. మనకి స్వాతంత్ర్యం సంపాదించి రోజూ కరెన్సీ నోటుపై మనకు దర్శనం ఇస్తూనే వున్నారు. చెడు ఆలోచన రాకుండా ఎలా వుంటుంది? అసలు మంచీ చెడూ ఎలా తెలుసుకోవటం?



పండితులు వేదాలు చదివి, పురాణాలు చదివి, తెలుసుకోగలరు. మరి సామాన్యులు ఎలా మంచి చెడూ తెలుసుకోగలరు? అప్పుడు ఆవిర్భవించాయి శతకములు. వేమన శతకం తీసుకోండి. అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను. సజ్జనుండు పలుకు చల్లగాను. (ఎలాగంటే...) కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా? విశ్వదాభిరామ వినుర వేమ. గొప్పలు చెప్పుకునే వాళ్ళ మాట నమ్మకూడదని ఎంత తేలికగా చెప్పాడు వేమన.

నేను శ్రీ సాయి సచ్చరిత్ర ద్విపదలో వ్రాస్తున్నప్పుడు. మంజరీ ద్విపద గురించి చదవటం తటస్థించింది. దీంట్లో నాలుగు పాదాలు, పాదానికి నాలుగు గణాలు ఉంటాయి. ప్రాసయతి నిషిద్ధమవడం చేత ఆటవెలది పద్యం కంటే కష్టమైనది (నా అభిప్రాయం...) దీన్ని ఎవ్వరూ విస్తారంగా వాడటం లేదు. అందుకనే నాకు మంజరీ ద్విపదలో ఏదన్నా వ్రాద్దామనిపించింది.

నీతి శతకం వ్రాద్దామనిపించింది. ఇదివరకు నేను



నాలుగు శతకాలు వ్రాశాను. ఒక్కొక్క శతకంలో వ్రాశాను. ఒక్కొక్క రకం పద్యం (సీసం, కందం, ఆటవెలది, తేటగీతి) ఈ మంజరీ ద్విపద నాకు చాలా నచ్చింది.

మం॥ (మంజరీ ద్విపదలో) నేను వ్రాసే ఈ శతకానికి భర్త పుట్టపర్తి సత్యసాయి బాబా. మకుటం "సత్యసాయీ నీవె సద్బోధకుడవు" అని ఎంచుకున్నాను.

నేనేదన్నా అనుకుంటే చేయాల్సిందే. లేకపోతే ఆది పురుగులా మెదడు తొలుస్తూనే వుంటుంది. సరే శతకం మొదలయింది.

ప్రతి పద్యానికి తాత్పర్య సహితంగా సాధ్యమైనంత తేలిక భాషలో (నాకు వచ్చిందే అది సుమండీ....) వ్రాశాను. ఇవన్నీ నా స్వంతంగా వ్రాసినవే. కానీ నేను కనిపెట్టినవి కావు. అందుకే చాలా పద్యాలు ఎక్కడో విన్నట్లుగా వుంటాయి.

నీతి శతకం అంటే వంద పద్యాలలో లేదా శ్లోకాలలో వ్రాయబడిన నీతి వాక్యాలు. చిన్న ఉదాహరణకి "పెదవి

దాటగరాదు పేదకు వాక్కు" తీసుకోండి. పేదవానికి మాటపైకి అనే ధైర్యం ఉండదు. ఉండకూడదు. ఏమవుతుంది. బాగా డబ్బున్న వాణ్ణి అనటమో, లేదా వ్యతిరేకంగా మాట్లాడటమో చేస్తాడు. అలా చేసి కష్టాల్లో ఇరుక్కుంటాడు.

కొన్ని పద్యాలు ఉదాహరణతో చెప్పదలుచుకున్నది చెప్పటం జరుగుతుంది.

"ఆకలి లేకున్న అన్నంబు వెగటు" ఎలా అంటే బంగారం కొండ మీ స్వంతమే కానీ దాన్ని అమ్మలేరు. కొనేవాడు లేడు. ఏం చేసుకుంటాం. మా ఇంట్లో ఒక వీడియో కాసెట్ ప్లేయరుంది. ఇవ్వాళ అది ఉన్నా ఉపయోగం లేని ఆస్తి. ఒకప్పుడు ఆస్థి అయింది, ఇవాళ లయబిలిటీ. ఈ విధంగా జరిగే విషయాలలో సత్యం తెలుసుకోవటమే నీతి శతకం ఉద్దేశ్యం.

రెండు చిలకలు ఒక అడవిలో వున్నాయి. అడవి మీద విసుగుపుట్టి పట్టణానికి ఎగిరి వచ్చాయి. ఒకటి మాంసం కొట్టువాడి దగ్గర చేరింది. ఇంకొకటి సజ్జనుడైన బంగారం కొట్టువాడి దగ్గర చేరింది. కొన్ని రోజుల తర్వాత ఈ రెండూ



మళ్ళీ పట్నంమీద విసిగి, ఎక్కడ నుంచి వచ్చాయో అక్కడే చేరాయి. కానీ మొదటిది 'ఒరే బద్మాష్ ఒళ్ళు కొవ్వెక్కిందా అంటుంటే రెండో చిలక "అయ్యా అంతా బాగున్నారా? అమ్మా ఆరోగ్యంగా వుందా?" అని అంటుంది. ఇప్పుడు అర్థమయిందా నీతి శతకం యొక్క ఆవశ్యకత.

ఒక స్కూలుకి వెళ్ళి పిల్లలు మాట్లాడుకుంటుంటే వినండి. ఆడపిల్లలు మొగ పిల్లలూ, పెద్దా చిన్నా బేధం లేకుండా యధేచ్ఛగా బూతులు వినబడతాయి. కారణం ఏమిటి? వాళ్ళకి అమ్మా నాన్న లేరు. మమ్మీ డాడీలు ఉన్నారు. అధ్యాపకులు లేరు – సార్లు మేడమ్‌లు ఉన్నారు.

శ్రీరాముని దయచేతను... చదవటం లేదు, జానీ జానీ వాట్ పప్పా... అని చదువుతారు. మోరల్ క్లాసులు ఇంట్లో పడియుండే ముసలివాళ్ళలా నిరుపయోగంగా కేవలం పేరుకి ఉన్నాయి. పరీక్షలేనిదే ఎవరు చదువుతారు? ఎవరు అర్థం చేసుకుంటారు?

బాల్యంలో చదివేది బల్లిలా పట్టుకుని ఉంటుంది.



ఈనాటి తల్లిదండ్రులు మా అబ్బాయి చెస్ ఛాంపియన్, క్రికెట్‌లో టెండూల్కర్, కంప్యూటర్ జీనియస్ అని మురిసిపోతున్నారే గాని, వాడు సుమతి (మంచి మనస్సుకలవాడు) అవునా కాదా చూడడం లేదు. 'ఇటికెట్' ని నీతి ప్రవర్తన అని భ్రమ పడకూడదు.

'ఇటికెట్' అంటే మర్యాదగా ప్రవర్తించుట. మర్యాదగా వుండటం మాత్రమే. మర్యాదగా వుండడం నీతిగా ఉండడం, వేర్వేరు లక్షణాలు. రిసెప్షనిస్టుల్ని చూస్తున్నప్పుడు మనం చూసేది మర్యాద.

మర్యాదస్తుడు మంచివాడే అని భ్రమ పడకండి. అలా పడి మనం ఎంత నష్టపోయామో "ఓల్డేజి హోమ్" లు "గెట్ వెల్ సూన్" కార్డులు చెప్పటం లేదా?

మళ్ళీ ఒక్కసారి చెప్పుకోవాలి. సభ్యత వేరు మంచితనం వేరు. మనకి సభ్యత అవసరమే, కానీ మంచితనం అంతకంటే ఎక్కువ అవసరం. నాలాంటి సామాన్యునికి ఈ పరిస్థితి చక్కదిద్దే శక్తిలేదు. అయినా



నిరుత్సాహం కంటే పెద్ద జబ్బులేదని నమ్ముతాను కాబట్టి, నావంతు ప్రయత్నంగా ఇది అందిస్తున్నాను. ఇది గొప్ప ప్రయత్నం కాదు, కానీ నిజాయితీగా చేసే ప్రయత్నం. మనం నీతిమంతులైన పిల్లలకోసం మన వంతు కృషి చేద్దాం.

'సత్యసాయీ నీవె సద్బోధకుడవు' అనే మకుటంతో సాగే ఈ నీతి శతకం సత్యసాయిబాబాకు నాభక్తి పుష్పం. ఆయన మనబోటి కోట్లాదికి సద్బోధకుడు. నీ నా అనే భేదం, ఉన్నతుడు అధముడు అనే భేదం లేకుండా జ్ఞాన భిక్ష నర్థించే అందరికీ జ్ఞానం ప్రసాదించేవాడే గురువు. భయం, సందేహం, మోహం లేక నిర్వికారంగా ఉండే వాడే గురువు. అటువంటి గురువులలో ఈ సత్యసాయి నేడు సర్వ శ్రేష్టులు. నాకు ఆయన బోధలతో పెద్ద పరిచయం లేదు. కానీ ఇది ఆయన ప్రేరణచే నేను వ్రాయగలిగాను కాబట్టి ఆయన బోధగా భావిస్తూ ఆయనకే అర్పిస్తున్నాను.

## అంకితం

ఉ॥ అంకితమీదలంచితిని ఆప్తుడవీవని నమ్మకంబుతో
పంకజనాభు దందరికి ప్రాప్తుడు కాడిది నిక్కమౌ గదా!
సంకట మెల్ల దీర్చగను 'సాయి' గ నుంటివి పుట్టపర్తిలో
అంకితమందుచున్ కరుణ నందరి గావుము సత్యసాయివై

తా॥ పద్మనాభుడైన ఆ శ్రీహరి అందరికీ లభించడు. ఇది నిజమే గదా. కానీ భక్తుల కష్టాలను తీర్చటానికి మళ్ళీ సాయిబాబాగా పుట్టపర్తిలో అవతరించి, సత్యసాయివై అందరినీ దయతో కాపాడే మీరు దీనిని అంకితం పుచ్చుకోండి. మీరు ఆప్తులనే అనే నమ్మకం కలిగి అంకితమిద్దామని తలచాను. ఓ ప్రభూ ఇది మీకు అంకితం.



## ప్రార్థన

కం॥ శ్రీకారంబును జుట్టితి
ఏ కామనలేక నేను ఈకృతిచేయన్
లోకోత్తమ శ్రీ సత్యా!
ఈ కాలపు 'నీతి' ఇదియె ఎల్లరు పొగడన్

తా॥ లోకానికంతటికీ ఉత్తముడవైన ఓ సత్యసాయీ ఎలాంటి కోరిక లేక ఈ కాలానికి అనువైన 'నీతి'ని ఇప్పుడు వ్రాయుటకై శ్రీకారం చుట్టి ప్రారంభించు చున్నాను. దీనిని అందరూ పొగిడెదరు గాక.



కం॥ మంచిని పెంచెడి వారలు
ఎంచెదరిల నిన్ను తాము ఈశ్వరుడంచున్
మంచిని మెచ్చని వారలు
కొంచెము జేసెదరు నీకు కొదవా? సత్యా!

తా॥ మంచిని పెంపొందించే వాళ్ళు నిన్ను 'ఈశ్వరు' దని భావిస్తారు. మంచిని మెచ్చని వారంతా నీగురించి తక్కువగా మాట్లాడెదరు. అంతమాత్రంచేత నీకేం తక్కువ. ఓ సత్యసాయీ! ఏమాత్రం కాదు.



## మంజరీ ద్విపద :

మం॥ మంజరీ ద్విపదన్న 'మాటలు కాదు'
దానిలో 'నీతి శతకము' చెప్పెదను
సాహసంబిదియౌట సత్యమే కాని
తెగువ లేక బ్రతికితే నేమి ఫలము?

తా॥ మంజరీ ద్విపదలో వ్రాయుటం మాటలా? ఏమాత్రం కాదు. దానిలో నీతిశతకం చెప్పటం అంటే సాహసమే అనుట సత్యమే మరి. అయితే తెగువ, సాహసం లేక బ్రతికితే ఏం లాభం? వృధా.

మం॥ ఎనుబదిలో నాకు 'ఈసాయి' జూచు
భాగ్యంబు కలిగింది పలుకులు వింటి
తలచితి నరుడెట్లు దైవంబు అవును
ఈనాడు నాతప్పు నెరిగితి నేను

తా॥ నాకు 1980లో ఈ సత్యసాయిని చూడడం సాధ్యపడింది. ఆయనతో మాట్లాడడం తటస్థించింది. ఆనాడు ఒక సాధారణ మనిషి దేవుడెట్లా అవును అని భావించాను. కానీ ఈనాడు నా తప్పు తెలిసింది. ఆయన దేవుని అవతారమనే నా భావన.

మం॥ విశ్వ విఖ్యాతులు వేలాదిబూని
జూడ, వేచెదరంత చూపె భాగ్యమని
దీనినేమందురో తెలియలేకుంటి
వైష్ణవమాయ యా వాదనలేల?

తా॥ నేను ఒక్కసారి చూస్తే చాలు అనుకునే మహామహులు, 'లైను' లో నిలబడి ఆయనను ఆశ్రయిస్తున్నారంటే దానినేమంటారో తెలియటం సాధ్యపడుటలేదు. దేవుడంటే కిరీటం, ఆయుధాలు. ఉంటాయా! మన ఊహాలేకదా. సర్వాంతర్యామికి మనం మన మనస్సు నిలుపుకోటానికి ఇచ్చిన రూపమే ఆ పరమాత్మ అవతారాలు. మనం ఎదురుగా తిరిగే ఈయనే దైవం వేరే దైవం ఎక్కడ? ఆ పరాత్పరుడి సాకార రూపాలే మహామహులందరూ. ఇది నిజం.



మం॥ ప్రతి జీవిలోనుండు భగవంతుడొకడె
ఆయన లేకున్న అదియే శవంబు
ఆయన నెరిగిన ఆతడే జనుల
పూజలందును తానె 'భువిదైవ' మంచు

తా॥ ప్రతి జీవిలోనూ భగవంతుడు 'ప్రాణము' వలె ఉంటాడు. ఆ ప్రాణమే లేకుంటే ఇక మిగిలింది కట్టెలాంటి శవమే కదా. ఆ భగవంతుని తెలుసుకున్న వాడె తానుకూడా దైవం అని భావించబడి ఆ దైవం వలెనే భూలోకంలో పూజించబడుతున్నాడు. ('అహం బ్రహ్మాస్మి' అనే ఆది శంకరుల వాక్యం దానినే చెబుతున్నది)

మం॥ నీతి శతకమిది నేవాయుచుంటి
సత్యసాయికి పూజ జరుపంగ నెంచి
నీతి జెప్పెదగాని నేకోరనేది
నీతి మించిన దేది? నిఖిలమంతటికి



తా॥ ఓ ప్రజలారా! ఇది నీతి శతకము. సత్యసాయికి పూజ అని భావించి వ్రాస్తున్నాను. ఇది నిస్వార్థంగా కేవలం నీతి వాక్యాలు చెప్పవలెనని భావించి ఏ కోరికా ఆశించక చేసే ప్రయత్నం. ఈ ప్రపంచంలో నీతిని మించిన జ్ఞానం లేదు కదా.

మం॥ తప్పులెన్నకుడయ్య "తమ్ముడ" నంచు
యెంచి మన్నించరే యెంచి ఒప్పులను
నాతోటి ఒకమారు నగవుచూ అనరె
"సత్యసాయీ నీవె సద్బోధకుడవు"

తా॥ నన్ను సోదరునిగా భావించి ఇందులో తప్పులుంటే క్షమించండి. కేవలం ఒప్పులనే చూడండి. ఒక్కసారి నాతో కలిసి ఓ సత్యసాయీ మా కందరికీ నీవే సద్బోధకుడవు అనండి.



## "సత్యసాయీ నీవె సద్బోధకుడవు

మం॥ ఆగ్రహమ్మే మేలు, హాస్యంబు కన్న
1 'హాస్యము' నరులకు హానియౌ, నిజము
నోరు జారినవాడు మసియౌను తుదకు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ మనిషికి కోపం తగదు. ఇది అందరికీ తెలిసిందే. కానీ, ఆ కోపమే మేలు. దానికన్న అనవసరమైన 'నవ్వులాట' మనుషులకు కీడు తెప్పిస్తుంది. ఇది నిజం. ఎందుకంటే నోరుజారి మాట్లాడినవాడు చివరకు నశించిపోతాడు. ఓ సత్యసాయి మాకు నీవే మాకు సద్బోధ చేయగల గురుడవు.

మం॥ అరుదుగా దొరికేది అతి వాంఛితమ్ము
2 రత్నాలు కావాలి రాజులకైన
దేవుడే యెదరునై తిను తిట్లు కాదె?
సత్యసాయీ! నీవె సద్బోధకుడవు.

తా॥ ఏదయితే కష్టంతో చాలా అరుదుగా లభిస్తుందో అదె అందరిచేత చాలా ఎక్కువగా కోరుకోబడుతుంది. అందుకే గదా రత్నం కోసం ఆరాటమూ దుఃఖమూ పడి మనుష్యులు సిగ్గు, అభిమానము వదులుకుంటారు. ఆ దేవుడైనా మన ఎదురుగా వుంటే మనతో తిట్లు తింటూ ఉంటాడు. కాదా సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయగలవాడివి.

మం॥ వాస్తు వాస్తనియంచు వాదాలు యేల?
3 కిటికీలు మార్చిన కీడు తప్పేన?
అట్లైన దేవుని అర్చించనేల?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ వాస్తు అని ఇన్నిరకాల వాదనలు అనవసరం కదా. మనం పుట్టేటప్పుడే మన మంచి చెడ్డలు ఆ 'బ్రహ్మ' మన నుదుట వ్రాశాడు. అందుచేతనే మనకిష్టంలేని వెన్ని జరిగినా మనం భరించక తప్పదు. కిటికీల



సంఖ్య మార్చి, ఉన్నచోటునుంచి మార్చినంత మాత్రాన మనం దురదృష్టం తప్పించుకోగలిగితే సర్వ సమర్థుడు ఆ పరమాత్మని పూజించే వాడుంటాడా? ఓ సత్యసాయి మా అందరికీ నీవే సద్బోధ జరుపగలవాడవు.

మం॥ నేజేయునది ఒప్పు, నీజేత తప్పు
4 'నేజెప్ప నిజమది నీదంత కల్ల'
ఇదియే నరుని తీరు ఏనాటికైన
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఈ లోకంలో మనుష్యుల తీరు ఏ కాలంలో అయినా ఇలాగే వుంటుంది. నీవు ఏది జేసినా తప్పు. అదే నేను చేస్తే సరి అవుతుంది. నీవు ఏం చెప్పినా అబద్ధం. నే చెప్తే మాత్రం నిజం. ఇలాంటి వితండ వాదులనేం చేయగలం. మాకు నీవే సద్బోధకుడవు.



మం॥ మరుగు దొడ్డికి పక్క మల్లెల తీగ,
5 'పాడె' మీది ధనము, పరుల బిడ్డడును,
పాలివాని 'నెనరు' బడయునే మేలు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ మరుగు దొడ్డి (లెట్రిన్) పక్క మల్లెపూల తీగ, శవం వుండే పాడెమీద వేసిన చిల్లర డబ్బులు, పరాయివాళ్ళ బిడ్డడు, మన పాలివాడు (అర్జునుడు ధర్మరాజు సోదరులు, అర్జునుడు దుర్యోధనుడు పాలివాళ్ళు) చూపించే ప్రేమ – వీటివల్ల ఏమాత్రం ఉపయోగం లేదు. (అంటే ఉండటానికి ఉన్నా వాటివల్ల మంచి జరుగదు) ఓ సత్యసాయీ మాకందరికీ నీవు సద్బోధ చేయగలవాడవు.

మం॥ మంచితనమది, ఏమాత్రము చెడని
6 సంపెంగ వంటిది జతనుండు వేళ
అందరికి సుఖము అద్దాని అగరు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ (మానవుడి) మంచితనం ఎటువంటిదంటే, అది ఏమాత్రము చెడని నూతనమైన సంపెంగ పూవు వంటిది. సంపెంగయొక్క పరిమళం దగ్గర ఉంచుకుంటే వీరికి వారికీ అనికాక అందరికి హాయినిస్తుంది. సువాసన అందరికీ హాయినిచ్చినట్లె మంచితనం అందరికి సుఖాన్నిస్తుంది. ఓ సత్యసాయీ! నీవె మాకు సద్బోధకుడవు.

మం॥ అతి ప్రేమ భార్యని అతి శ్రద్ధ సుతుని
7 అతి నమ్మకము 'బంటు' నదుపు తప్పించు
అధిక నీరము మొక్కకది హాని కాదె?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఎట్లాగైతే ఎక్కువ నీరు మొక్కకు హానికరమై తగినది కాదో అట్లె అతి ప్రేమ భార్యను, అతి శ్రద్ధ పుత్రుని మరీ ఎక్కువ నమ్మకం పనివాడిని చెడగొట్టి అపకారం చేస్తుంది. ఓ సత్యసాయీ! మాకందరికి నీవే సద్బోధకుడవు.

మం॥ తల్లి చచ్చినయంత తండ్రి చిన్నాన్న
8 మేనమామే మేలు మేదిని నిజము
కఠినమౌ మాటిది, కల్ల కాదెపుడు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ కన్న తల్లి చనిపోతే తండ్రికూడా ఇంకొక వివాహం చేసుకుని (లేదా విముఖత ఏర్పడి) చిన్నాన్న అయిపోతాడు. వానికంటే ఈ ప్రపంచంలో మేనమామ చాలానయం. ఓ సత్యసాయీ! ఈ మాట కఠినంగా వున్నా అబద్ధం కాదుసుమా. అందుకే మాకు సద్బోధ జరుపగలవాడవు నీవే.

మం॥ కట్టెలందు తనువు కాలేటి వరకు
9 కామక్రోధములను కట్టనేలేరు
ఇతడింక ఇలముక్తినెట్లు సాధ్యంబు?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఈ శరీరం కట్టెల్లో కాలేదాకా కామ క్రోధములను అదుపులో వుంచుకోలేరు (మనుష్యులు). ఇక మోక్షం ఎలా దొరుకుతుంది? అసాధ్యం కదా. ఓ సత్యసాయీ దీనికి మాకు నీవే సద్బోధ చేయువాడవు. కేవలం అట్టి బలహీనతలున్నంత మాత్రాన నన్ను కాపాడకపోతే ఎలా? దయజూపు).

మం॥ తప్పుజేసిన బిడ్డ దండన లేక
10 చెడు, కులమెల్లను చెరచును సుమ్మి
పొగరుబట్టు పశువు పొలమంత చెరచు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ పొగరు బట్టిన పశువు పొలమంతాపాడు చేస్తుంది. దానిని దండించక పోతే చాలా నష్టం కలిగిస్తుంది. అలాగే తప్పుచేసిన బిడ్డను అతి ప్రేమవల్ల శిక్షించక వదిలివేస్తే పెద్దవాడై కులభ్రష్టుడవుతాడు సుమా. సత్యసాయీ నీవే మాకందరికీ సద్బోధ చేయగలవాడవు.



మం॥ మూర్ఖుడు ఒకడున్న మునుగును కులము
11 సందేహమే లేదు చత్తురెల్లరును
'కాపాడు' అగ్నిని గడ్డిలో నతడు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఒక్క బుద్ధి హీనుడుంటే మొత్తం కులాన్ని (వంశాన్ని) పాడుచేస్తాడు. ఏమాత్రం సందేహం లేదు. అందరూ నాశనమవుతారు. నిప్పు మనకి జీవాధారమే, కానీ తెలివి లేని బుద్ధిహీనుడు ఆ అగ్నిని గడ్డిలో దాచుకోవాలనుకుంటాడు. అంతా కాలిపోయి నశిస్తాడు. ఓ సత్యసాయీ మాకు నీవే గదా, సద్బోధ చేయగలవాడవు.

మం॥ చెడ్డవానిని గూడి సేవించరాదు,
12 పరుష వచనమును పలుకంగరాదు
ఆరెండు పాటించు నాతడుత్తముడు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ చెడ్డవానిని చేరి వాడిని సేవించరాదు. (వాడుచేసే చెడ్డ పనులు మనం కూడా చేయాల్సి వస్తుంది) కఠినమైన మాటలు మాట్లాడరాదు. (అలా చేస్తే మనం తిట్లుగానీ, దెబ్బలు గానీ తినవలసి వస్తుంది). ఈ రెండు పనులు చేయని వాడే కదా ఉత్తముడు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయగల గురుమూర్తివి.

మం॥ తన పొరపాటుకు తాను సిగ్గొంది,
13 మరల చేయని వాడె మాన్యుండు జుమ్మి,
తప్పు చేయనివాడు ధరలోన లేడు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ తప్పు చేయనివాడు ఈ ప్రపంచంలో ఉంటాడా? అసాధ్యం. కానీ తను జేసిన తప్పుకు సిగ్గుపడుతూ మళ్ళీ అలాంటి తప్పు జేయని వాడు ఈ లోకంలోనే లేడు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయగలవాడవు.

మం॥ దుష్టుల స్నేహము దోషంబు కాదె?
14 చక్కెర తినునట్లు చవులూరు గాని
చివరకు వ్యాధితో చేయును హాని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ దుర్మార్గులతో స్నేహం చాలా తప్పు. పంచదార తింటుంటే మొదట తియ్యగా రుచులకు మధురంగా ఉంటుంది. కానీ చివరకు రోగాన్నిస్తుంది. అలాగే దుర్మార్గుల స్నేహం మొదట సంతోషంగానే ఉన్నా చివరకు ముప్పు తెప్పిస్తుంది. ఓ సత్యసాయీ నీవే సద్బోధ జరుపగల సమర్థుడవు.

మం॥ పూదేనె తుమ్మెదతో పొందనాసించు
15 విరులపై బంధమ్ము పెట్టుకోదెపుడు
నిస్సంగుడౌవాడె నేర్పరి భువిని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ తుమ్మెద పూల మకరందం త్రాగటం చేతనే బ్రతుకుతుంది. కానీ పూలపై మమకారం పెంచుకోదు. అట్లే ఈ ప్రపంచంలో ఏ బంధం పెట్టుకోని విజ్ఞానే నేర్పుగలవాడు. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయగలవాడవు.

మం॥ ఆకలే తిండికి అందించు రుచిని
16 ధైర్యమే నరులకు దెచ్చును బలము
ఈవియే ధనముకు ఇచ్చును శోభ
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! తిండికి రుచిని (ఇష్టమైన) ఇచ్చేది ఆకలి, మనుష్యులకు బలము నిచ్చేది ధైర్యమే. మనిషి సంపాదించిన సంపదకి శోభ కూర్చేది (మంచి చెడ్డలు చూచి) చేసే దానగుణమే. మాకు సద్బోధకుడవు.



మం॥ తగదయ్య స్వోత్కర్ష, తగదు విమర్శ
17 సేమంబు కాదది చెరచును చెలిమి
పెంచు శత్రుత్వము విరుగును సుఖము
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఎప్పుడూ తనని తను పొగుడుకుంటూ ఇతరులకి ఇబ్బంది కలిగించరాదు. ఇతరులని విమర్శలు చేస్తూ ఉండరాదు. అలా చేస్తే స్నేహం చెడిపోవటమే గాక శత్రువులని పెంచుతుంది. మరి ఇక సుఖము నాశనం అయిపోతుంది. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయగల గురుడవు.

మం॥ పాపలకల్లరి, పడతుల కోర్పు
18 బంటున కణకువ, పతులకు దయయు
తిండికి లవణంబు తెచ్చును శోభ
సత్య సాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ పాపాయిలకి అల్లరి, స్త్రీలకి ఓర్పు, సేవకులకి అణకువ, యజమానులకు దయాగుణము ఆహారానికి ఉప్పు శోభ చేకూరుస్తాయి. ఓ సత్యసాయీ నీవే నయ్యా మాకు సద్బోధ చేయగల సమర్థుడవు.

మం॥ శ్రద్ధలేని వ్రతము, జరుపంగ నేల?
19 తపము జేయగనేల తనరకశాంతి
ఏకాగ్రతయు లేక ఇలజపంబేల?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ శ్రద్ధ లేకుండా చేసే వ్రతము ఎందుకు? నిష్ఠ లేని తపస్సువల్ల ఏ ఉపయోగం లేదు. ఏకాగ్రత లేక జపాలెందుకు? ఏ ఉపయోగం లేదు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయగల గురుమూర్తివి.

మం॥ దోషితో తిరుగు నిర్దోషియు కూడ
20 శిక్షపొంది తుదకు, చింతించు తాను
కట్టెలతో పాటు కాలు పురుగులు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ నేరస్థునితో తిరిగే మంచివాడు కూడా శిక్షించబడి విచారిస్తాడు. పురుగులు కేవలం కట్టెలతో వున్న నేరానికి ఆ కట్టెలతోపాటు కాలి నాశనమవుతాయి. (అందుకనే నేరస్తుల స్నేహం చాలా అపాయకరం). ఓ సత్యసాయీ! మాకు నీవే సద్బోధ చేయగల సమర్థుడవు.

మం॥ కల్లలాడే వాని గౌరవించెదరు
21 సత్యసంధుడు తిను చావు దెబ్బలను
తారుమారగు నిది తప్పక తుదకు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ! ఈ ప్రపంచంలో అబద్దాలతో ఆడంబరంగా ఉండేవాడిని మిక్కిలి గౌరవిస్తారు. నిజం నిష్ఠురంగా అప్రియంగా వుంటుంది కాబట్టి నిజం చెప్పే వాడిని చావు దెబ్బలు కొట్టి హింసిస్తారు. అయితే, ఇది తాత్కాలికమే. చివరకు అసలు సంగతి తెలిసాక ఇదంతా తారుమారవుతుంది. నీవే మాకు సద్బోధ చేయగల సమర్థుడవు.

మం॥ నరికిన చెట్టైన నయముగా మొలుచు
22 విరిగిన కాలైన వింతగా అతుకు
గాయమైన మనస్సు కల్ల బాగవుట
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! చెట్లు నరికినా తిరిగి చిగురిస్తాయి. కాలు విరిగితే బాగుగా కట్టు కడితే అతుక్కుంటుంది. కానీ (అవమానింపబడి) మనస్సు గాయ పడితే మాత్రం తిరిగి బాగుపడుట మాత్రం జరుగని పని నీవే మాకు సద్బోధకుడవు.



మం॥ కడుపులో పుండట్లు కనబడకుండ
23 బాధించి జంపును, పరులేయు నింద
ఆరీతి కంటకం బట్లు బాధించు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! కడుపులో వున్న పుండు పైకి కనబడక పోయినా బాధ పెట్టి మరీ చంపుతుంది. అదే విధంగా ఇతరులు వేసే నిందకూడా ముల్లులాగా బాధించి ఒక్కొక్కప్పుడు చంపుతుంది కూడా. నీవే మాకు సద్బోధ చేయగల సమర్థుడవు.

మం॥ చెడు మాటలాడేటి చెనటి ఎల్లపుడు
24 తన నోటి కంపును తానుగా దెలుపు
మౌనమే మేలౌను మన్నన నిచ్చు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ! ఈ లోకంలో అసభ్యంగా మాట్లాడే మూర్ఖుడు తన నోటికంపును తనే బయట పెట్టుకుంటాడు. అట్లాంటి దుర్మార్గుడిలా మాట్లాడి పరులను బాధించి తను అసహ్యంగా చూడబడే కంటే మనుష్యులు మౌనంగా ఉండడం ఎంతో మర్యాదనిస్తుంది.

మం॥ దయలేని తనవారి దరిజేరుకన్న
25 దయగల పెరవారు దరిజేర సుఖము
కఱచు చెప్పుల వీడి కడుసుఖంబిచ్చు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! దయలేనటువంటి తనవారి దగ్గరకు (ఆపద సమయంలో) పోవుట కంటే దయ సానుభూతిగల పరాయివారు చాలా నయము. కొత్త చెప్పులు కరిచి ఎంతో బాధ పెట్టును. అట్టి సమయంలో ఉత్త కాళ్ళతో నడచుట ఎంతో సుఖము కదా. మాకు సద్బోధ చేయగల గురుడవు నీవే ప్రభూ!

మం॥ పాచిపై జారిన వానిని జూచి
26 నవ్వును జగమంత నయము కాదేడ్వ
ఏడ్చువాని జూచి ఇకిలించు జగతి
సత్యసాయీ నీవె సద్బోధకుడివి.

తా॥ ఎవరైనా పాచిమీద జారిపడితే అయ్యో అని జాలిపడకుండా వానిని జూచి అందరూ నవ్వుతారు. అప్పుడు ఏడవటం తగదు. ఏడిచే వానిని చూచి జగమంతా ఆనంద పడుతుంది. కాబట్టి మన ఏడుపువల్ల పరులకు ఆనందమని గ్రహించి ఎప్పుడూ సంతోషంగా ఉండాలి. ఓ సత్యసాయీ మాకు సద్బోధకుడవు నీవే.

మం॥ అందాన్ని వృద్ధాప్య మవని హరించు
27 అణగించు ధైర్యమ్ము నమితమౌ ఆశ
మూర్ఖుడై జగమొండి ముంచునందరిని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ! ముసలితనం అందాన్ని, ఆశ తెగింపును పాడు చేస్తాయి. అలాగే మొండి పట్టుదల గల మూర్ఖుడు ఇంగిత జ్ఞానం కోల్పోయి ఈ భూగోళాన్నే తను నాశనం చేస్తాడు. మాకు నువ్వే సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ వాగుడు సభ్యతన్, వాదము చెలిమి
28 మెక్కుడు మేనిని మితిలేక నణచు
గాలిలో దీపమ్ముగానుండు సుమ్మి
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! అతిగా మాట్లాడడం గౌరవాన్ని, వాదన చేయటం వంటి దురలవాటు వల్ల స్నేహము, మితి లేకుండ మెక్కే తిండి శరీరాన్ని హరించి వేస్తాయి. గాలిలో దీపం ఆరిపోతుంది, కదా! ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయు గురుడవు.



మం॥ తెలియని తావులన్ తిరుగుట తప్పు
29 ఏటిగట్టున నిద్ర ఏదో ఒకపుడు
హాని చేయుట తథ్యమని దెల్పవలెను
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ తెలియని చోట్ల 'రికామి' గా తిరుగుట మంచిది కాదు. ఏటిగట్టున నిద్రపోయే వాడిని పొంగిన ఏరు ఏదో ఒకరోజున ముంచుతుంది. ఇవ్వాళ ఏమీ కాలేదు కాబట్టి ఎప్పుడూ హాని ఉండదని చెప్పలేం. ఏదో ఒకరోజు హాని తథ్యం. ఓ సత్యసాయి మాకు నీవే సద్బోధకుడవు.

మం॥ పుత్రికి పెండ్లియు, పుత్రుకుపాధి
30 ఇంతికి భద్రత ఈయనివాడు
వట్టి బోయిన గొడ్డువలె వ్యర్థుడతడె
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఎవడైతే కుమార్తెకు వివాహము, కుమారునికి బ్రతుకు దెరువు, భార్యకు క్షేమంగా నివసించే ఏర్పాటు చేయలేనివాడో అట్టివాడు వట్టిబోయిన గొడ్డు ఎలా పాలీయలేక నిరుపయోగమో అలా వ్యర్థుడు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ అడవి వ్యాఘ్రంబుకు అమరినరక్ష
31 వ్యాఘ్రంబు అట్లౌను వనికెల్ల రక్ష
యజమాని భృత్యుడూ అమరిరి యట్లె
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ పులి దట్టమైన అడవిలో నివసిస్తుంది. ఆ అడవి మనుష్యులు తేలికగా ప్రవేశింపలేనిది. కనుక అది పులికి రక్ష. అట్లే ఆ పులికి భయపడి జనం అడవిని ఇష్టం వచ్చినట్లు వాడి పాడు చేయరు. అదే విధంగా యజమాని లేకపోతే దాసుడికి తిండిలేదు. దాసుడు పనిచేయకుంటే యజమానికి తిండిలేదు. ఓ సత్యసాయీ! నీవె మాకు సద్బోధకుడవు.

మ॥ నీడలా తోడుండు నిఖిలేశ్వరుండు
32 కనరాడు కనులకు కలుగక భక్తి
దీపమొక్కటిలేక, తెలియునా నీడ
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఆ పరమాత్మ మన వెంటనె వుండి తిరుగుతూ వున్నా, గొప్ప భక్తిని పొందక ఆయనను చూడడం సాధ్యపడదు. మన నీడ అహర్నిశలూ (ప్రతిరాత్రీ పగలు) మన వెంటే వుంటుంది. కానీ కనబడదు. ఎందుకంటే దీపం లేదు గనుక. అలాగే జ్ఞాన జ్యోతి లేక ఆయనను చూడడం అసాధ్యం. నీవె ప్రభూ మాకు సద్బోధకుడవు.

మ॥ తనివి లేని నరుండు, దయలేని రాజు,
33 ఓర్పులేని పడతి, ఊక దంపుడును
భక్తి మాలిన పూజ వ్యర్థంబుజుమ్మి!
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ! తృప్తిలేని మానవుడు, కరుణలేని రాజు (యజమాని), ఓర్పులేని స్త్రీ, వడ్లు కాకుండా వట్టి ఊకదంపుడు నిరుపయోగం. ఎంతగొప్ప పూజ చాలా ఆర్భాటంగా చేసినా మనస్సులో పరమాత్మపై ధ్యాస, భక్తి లేకుండా వుంటే ఏమీ లాభములేదు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధచేయు గురుమూర్తివి.

మ॥ పండితుడవనిచో బంధువు కూడ
34 మేటి మంత్రవలేడు మేదినీపతికి
పెంపుడు కుక్కైన పెండ్లి గొంపోరు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ రాజుకు (అధికారికి) ఎంతమంచి స్నేహితుడైనా సరదాగా కబుర్లు చెప్పుకోటానికి తప్ప పండితుడు గాకపోతే మంత్రిగా (సెక్రటరీగా) పనికిరాడు. ఎంత మంచి కుక్క అయినా మురిపెంగా చూసుకుంటారు కానీ పెండ్లికి తీసుకుని వెళ్ళరు. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధకుడవు.



మ॥ పెరటి బావినిగాని బిడ్డను గాని
35 వాహనంబునుగాని పరులకీ రాదు
పూతీగవలె వాడి పోయి నశించు
సత్యసాయి నీవె సద్బోధకుడవు.

తా॥ మన స్వంతానికి వాడుకునే వాహనాన్ని, మన పెరటి బావిని, మన బిడ్డని ఇంకొకళ్ళ రక్షణలో వుంచరాదు. చాలా సాధారణంగా ఇంకొకళ్ళ రక్షణలో వుంచిన మన తోటలోని పూలతీగల్లాగా పాడయిపోతారు. ఓ సత్యసాయీ నీవె మాకు సద్బోధకుడవు.

మ॥ పగలు నిద్రించుట, పరస్త్రీల చెలిమి
అన్యుల విషయాల అతి జోక్యమున్ను
తగదయ్య దుఃఖము తప్పక నిచ్చు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ పగటి వేళలో నిద్రించటం, ఇతర స్త్రీలతో అనవసర మైన స్నేహం, ఇంకొకళ్ళ సంగతుల మీద అతి జోక్యం చేసుకోవటం ఏమాత్రం తగవు. ఎందుకంటే అది తప్పక దుఃఖాన్ని కలుగ జేస్తుంది. ఓ సత్యసాయీ! నీవే సద్బోధ చేయు గురుమూర్తివి.

మ॥ అతి మంచితనమైన, అమిత సిగ్గయిన
37 అతి ప్రేమ నరులకు హాని, ఎట్లన్న,
ఈదురు గాలిలో ఎట్లౌను నిద్ర
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ మనిషికి మంచితనం, సిగ్గు, ప్రేమ ఉండవలసిందే. కానీ అతి మంచితనం (మనకు హాని), అతి సిగ్గు (మనం జంకువల్ల ఏ పనీ చేయలేం), అతి ప్రేమ (మనకూ ఇతరులకూ హాని) మనుష్యులకు చాలా హానికరం. ఎందుకంటే పెద్ద గాలిలో దీపం ఆరిపోకుండా ఎలా వుంటుంది? ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయువాడవు.

మం॥ అలసత్వమైనను, అత్యాశ అయిన
గూల్చును శంకేల గుణవంతునైన
గడ్డి కప్పినగోయి కరినైన గట్టు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ అశ్రద్ధగా వుండడం కానీ, అత్యాశతోగాని మంచిది కాదు. ఆ గుణాలు నిస్సందేహంగా బుద్ధిమంతుడినైనా నాశనం చేస్తాయి. ఏనుగు అశ్రద్ధగా పోయి గడ్డి కప్పి ఉన్న గోతిలో పడి, బంధించబడుతుంది. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధకుడవు.

మం॥ కష్టాన అందరూ కాదను వారె
39 శిశిరంబులో తాను చెట్టు ఏదైన
ఆకులు రాల్చును అమరదు నీడ
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ, నేను దుఃఖంలో ఉన్నప్పుడు ఎవరూ నాగోడు పట్టించుకోరు. చెట్టుకు శోభను కలిగించు కలిగించే ఆకులు సైతం గ్రీష్మ ఋతువులో రాలి వదిలిపెట్టిపోతాయి. నువ్వే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ బలశాలి ధర్ముడై వదలడు శాంతి
40 రక్షకైపూను నిర్బలుడును శాంతి
శాంతి సౌఖ్యం బిచ్చు సజ్జనుజేయు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ శాంతి మనుష్యులకి సుఖము ఇవ్వటమే గాక ఉత్తమునిగా చేస్తుంది. అయితే బలంలేని అల్పుడు తన రక్షణ కోసం తప్పనిసరిగా మంచిగా ఉండాల్సి వస్తుంది. మరి బలశాలి ధర్మమే తనని రక్షిస్తుందని ధర్మ బద్ధుడై వుంటాడు. ఓ సత్యసాయీ నీవే సద్బోధ చేయు గురుమూర్తివి.



మం॥ చెడుగెల్చినట్లు తోచినగాని తొలుత
41 మంచియే నిలుచును మన్నన నిచ్చు
ఉరుముల జడివాన యునికెంత సేపు?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! మొదట్లో చెడు గెలిచి మంచి ఓడిపోతున్నట్లు, మంచిగా ఉండడం నిష్ప్రయోజనం అనిపించవచ్చు అది కాసేపు మాత్రమే. ఉరుములు మెరుపులతో ఆకాశం భయం కలిగించేట్లు ఉన్నా ఆ వాన వెంటనే వుంటుంది. ఓ సత్యసాయీ! నీవే మాకు సాక్షివి.

మం॥ దానంబుచే హితున్, దయచేత అరిని
42 సతిని సభ్యతచేత సాధించ వలయు
మగ్గంబు లేకుండ వస్త్రంబు కలదె?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ దానం చేసి సంతోష పెట్టి మిత్రుని, దయగల ప్రవర్తనతో శత్రువును, స్నేహంతో భార్యని గెలవాలి. మగ్గం లేకుండా వస్త్రం (నేయటం) సాధ్యం కాదు. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధకుడవు.

మం॥ బలిమికై తనవారి బాధించు వాడు,
43 దేవునే ధనముకై తెగనమ్మువాడు
నరునిరూపమున దానవుడే అతండు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఈ ప్రపంచంలో అధికారం కోసం తన బంధువుకి కూడా అపకారం చేసేవాడు డబ్బుకోసం దైవానికే ద్రోహం చేస్తాడు. అటువంటి మనిషి నరుని రూపంలో ఉన్న రాక్షసుడు. మంచి చెడ్డలు లేని వానిని ఏం చేయగలం. నీవే మాకు సద్బోధకుడవు.

మం॥ కఠిన ప్రవర్తనే ఘనుజేయు నృపుని
44 పాలన రాజ్యాన బాగుండు తుదకు
అంకుశంబుంచును అదుపున కరిని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ రాజును (అధికారిని) కఠినమైన నడవడి గొప్ప యజమానిని చేస్తుంది. అప్పుడు పరిపాలన బాగుంటుంది. కొంతమంది కష్టపెట్టుకున్నా అందరూ సుఖపడతారు. మదవుటేనుగును అదుపులో వుంచాలంటే అంకుశంతో పొడవక తప్పదు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ 'గొప్పవాడ' ని జనుల్ కొనియాడుముందు
45 వాని నడతజూచి బాగెంచ వలెను
ఏనుగెక్కిన యంత ఏలిక కాడు
సత్యసాయి నీవె సద్బోధకుడవు.



తా॥ ఎవరినైనా వాడి దర్పం చూచి గొప్ప వాడని భావించ రాదూ, వాడి నడవడి చూచి వాని మంచి చెడ్డలు నిర్ణయించాలి. ఏనుగెక్కి వెళ్ళె ప్రతివాడూ రాజు (శ్రేష్ఠుడైన అధికారి) అవుతాడా? కాదు కేవలం వాడి ప్రవర్తన వల్లనే గొప్ప వాడవుతాడు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయుగురుడివి.

మం॥ చెడ్డవానిని జనుల్ చేరరు కోరి
46 తమ పనికోసమే దరిజేరుతారు
పుల్ల పెరుగు కోరు భువిని ఎవ్వండు?
సత్యసాయి నీవె సద్బోధకుడవు.

తా॥ ఈ ప్రపంచంలో ఎవ్వరూ కోరి కోరి దుర్మార్గునితో స్నేహం చేయరు. వాళ్ళంతా పనియుండడం వల్ల ఆ దుష్టుల దగ్గర చేరతారు. ఎవడైనా కోరి కోరి పుల్లటి పెరుగు తింటాడా? ఓ సత్యసాయీ నీవె మాకు సద్బోధ చేయుగురుడివి.



మం॥ మోయు వాడెరుగును మోసేటి బరువు
47 చేయువాడెరుగును చేయు కష్టంబు
ఎవడి బాధను వాడె ఎరుగును సుమ్మి!
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! బరువు మోసే వాడికే తెలుస్తుంది. కష్టం చేసే వాడికే తెలుస్తుంది. అలాగే ఎవడు పడే బాధ వాడికి మాత్రమే తెలుస్తుంది. ఇంకొకరి కళ్ళకు నటనలాగ కనిపించవచ్చు. ఓ సత్యసాయీ మాకు నీవే సద్బోధ చేయు గురుడవు.

మం॥ అల్పమైనది లేదు అవనిలో వెదుక
48 ఈశుని దృష్టిలో ఏదైన నొకటె
మనకి తెలియకున్న మన్నిక లేదె?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఈ ప్రపంచంలో తక్కువ అని భావించ తగినది ఏదీ లేదు. పరమేశ్వరుడు దృష్టిలో అన్నీ సమానమే ఎవరైనా ఒకటే. మనకి ఈరోజు తెలియనంత మాత్రాన ఒక వస్తువు ఉపయోగం లేనిదని ఎలా అనుకోగలం. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ పొదుపులేనిది పెద్ద ఉద్యోగి భార్య
49 అప్పుజేసి మగని ఆపదయౌను
ఓటి కుండలో నీళ్ళు ఉన్నట్టులౌను
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! పొదుపు లేని ఆడది ఎంత పెద్ద ఉద్యోగి భార్య అయినప్పటికీ అప్పులు చేసి మొగుడికి అపకారం తెస్తుంది. చిల్లుకుండలో నీళ్ళు నిలుస్తాయా? నువ్వేకదా మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ కొండ దొలచి రాతి గుహలోన నరుడు
50 జీవించ వచ్చును చింతేమి లేక
రాతి గుండెను జేరి రంజింప లేడు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! యుగాల క్రిందటే మనిషి కొండల్ని దొలిచి రాతి గుహలు నిర్మించి ఎండా వానల నుండి అన్య ప్రాణులనుండి రక్షణ కల్పించుకున్నాడు. మనిషి అవసరమైతే నేటికీ అట్లా జీవించవచ్చు. కానీ ఎంత ప్రయత్నించినా కరుణలేని రాతిగుండెల్ని సంతోషపెట్టలేడు. నువ్వే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ చెడుజేయ మున్నె చింతించ వలయు
51 అలవాటు పడినంత ఆప సాధ్యంబె?
జూదరి తనయిల్లు జూడదేనాడు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఎవరైనా చెడుపని చేసే ముందు బాగా ఆలోచించాలి. అలవాటయితే దానిని ఆపటం అసాధ్యం. జూదం ఆడేవాడు కూడా మొదట మంచివాడే కానీ ఆ జూదానికి అలవాటు పడి, దానికి బానిస అయిపోయి చివరికి ఇంటినీ ఇల్లాలినీ మరిచి భ్రష్టుడవుతాడు. ఓ సత్యసాయీ! మరినువ్వే సద్బోధకుడవు. వీళ్ళందరినీ కాపాడు.

మం॥ పరుల సొత్తుకు ఆశ పడుచుండు వాడు
52 దొంగలా జీవించు తుది శ్వాస వరకు
జీవించు పిల్లిలా ఛీకొట్ట బ్రతుకు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! కష్టం చేయకుండా పరాయివాళ్ళ సొమ్ము తినడం అలవాటయి దొంగతనం చేసి బ్రతికేవాడు. చచ్చేదాక అట్లాగె బ్రతుకుతాడు. పిల్లి ఇంట్లో దొంగలా దూరి పాలు త్రాగి ఛీ పాడు పిల్లి అని అందరితో తిట్లు తింటుంది. వీడుకూడా అలాగే బ్రతుకుతాడు. ఓ సత్యసాయీ నువ్వే మాకు సద్బోధ చేయు గురుడవు.



మం॥ అదుపు దప్పిన వ్యయం బందించు వెతలు
53 ప్రాణాలు పోదాక బట్టి పీడించు
గండిపడ్డ చెరువు కన్నీటినిచ్చు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఎప్పుడూ మనం చేసే ఖర్చు మన ఆదాయంకంటే తక్కువగా వుండు రీతిగా చూసుకోవాలి. ఆ నియమం ఒక్కసారి తప్పితే (అప్పుల పాలయి) ప్రాణం పోయెదాకా వదలకుండా దుఃఖముల నిస్తాయి. చెరువుకి గండిపడితే ఇక మిగిలింది ఏడుపే కదా. ఓ సత్యసాయీ! మాకు నీవే సద్బోధకుడవు.

మం॥ చెక్క బొమ్మను జూచి చిన్నారి మురియు
54 నవ్వకుందుము పాప నవ్వులు జూచి
మన ఆటలకు నవ్వు పరమేశ్వరుండు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ చిన్నపాప చెక్కబొమ్మ తన బిడ్డగా భావించి ఎత్తుకొని ఇల్లంతా తిరిగి ఎంతో ఆనందిస్తుంది. దాని అమాయకత్వం చూచి మనమంతా నవ్వుకుని ఆనందిస్తాము. ఆ పరమాత్మకూడా ఈ బంధాలలో కట్టుబడి భ్రమలో ఉన్న మనని చూచి నవ్వుకుంటాడు. ఈ నిజం మన కెంతకీ తెలియదు. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ పరస్త్రీల పరికించ పాపమ్మటంచు
55 వాదించ ఏమౌను? పాటించవలెను
అగ్గిని గుడ్డతో అదిమేయగలరె
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ మనుష్యులు నీతులు చెప్పినంత మాత్రం చేత ఒరిగేది ఏమీలేదు. ఆ నీతిని పాటించాలి. పరాయి ఆడువారిని చూడడం పాపమని గొప్పగా ఉపన్యాసాలిచ్చి లాభంలేదు. అది నడతలో చూపించాలి.

నిప్పుని కఠినమైన రాతిచిప్పలో దాచగలరు గానీ గుడ్డలో అదిమిపెట్టి దాచటం సాధ్యమా? సత్యసాయి ప్రభూ నీవే మాకు సద్బోధకుడవు.

మం॥ తొందర పాటది తుదకిచ్చు వెతలు
56 యోచించి పనిజేయ యుత్తమంబగును
పచ్చి కాయను ద్రెంచ ఫలమేమి గలుగు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ తొందరపాటు ఎంత మాత్రం తగదు. చివరికి అది దుఃఖాన్ని కలిగిస్తుంది. అందుకే ఆలోచించి పనిచేయుట ఎంతో మంచిది. పండేదాకా ఆగకుండా తొందరపడి పచ్చికాయలు తెంచితే ఏమి లాభం. ఓ సత్యసాయీ నీవు మాకు సద్బోధ చేయు గురు దేవుడవు.



మం॥ గుణము జూడక నాతి గోరెడి వాడు
57 చెడు తాను అదె రీతి చెడు వానికులము
ఇల పునాదులు లేక ఏమగునిల్లు?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఒక స్త్రీని కేవలం అందం చూచి, గుణం చూడకుండ కోరుకునేవాడు, తాను చెడిపోతాడు. అంతేగాక వాని వంశమూ కులమూ చెడిపోతాయి. ఇలా తొందరపడ్డ ప్రతివాడూ దుఃఖించాడు. ఇంటికి పునాదులు లేకపోతే (కూలిపోక) ఏమవుతుంది. ఓసత్యసాయీ! నీవే మాకు సద్బోధకుడవు.
(ఇక్కడ కులము అంటే కులగౌరవం అని అర్థం)

మం॥ పిల్ల పాపలు లేని పెన్నిధు లేల?
58 ఆరోగ్యమే లేక అందాలు యేల?
అడవి గాచిన వెన్నెలౌగదా తుదకు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ! పిల్లలు, పాపలూ లేక ఎన్ని సంపదలు ఉన్నా లాభమేమిటి? మంచి ఆరోగ్యం లేనప్పుడు ఎంత అందంగా ఉంటే మాత్రం ఉపయోగమేముంది? అడవిలో చక్కటి వెన్నెల కాస్తే లాభమేముందో అలాగే పై రెండు నిరుపయోగం. ఓ సత్యసాయీ, నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ అధికారములు లేక అణగారు మంత్రి
59 యుండిన జనులకు ఉపయోగమేమి
పళ్ళు లేని ముసలి, పండెట్లు తినును?
సత్యసాయీ! నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ప్రజలకు ఏదన్నా మంచి జరుగవలె నంటే అధికారంలో వున్న మంత్రి అండగా వుండి పనిజేయాలి. అంతేగాని అధికారం పోయిన తరువాత ప్రజలకి నిరుపయోగి. పళ్ళులేని ముసలివాడికి రుచిగల పండునిస్తే ఏం ఫలం (ఉపయోగం). నీవేకద మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.



మం॥ లోతెరగని బావిలో దిగరాదు
60 శత్రువులింటిలో శయనించ రాదు
దీపంబులేనింట తిరుగాడ రాదు.
సత్యసాయీ! నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఎప్పుడూ (మనిషి) లోతు తెలియని బావిలో దిగరాదు, విరోధుల ఇండ్ల నిద్రించరాదు. దీపంలేని ఇంట్లో తిరుగకూడదు. ఆ పనులన్నీ ఏదో ఒకరోజు ప్రాణం తీస్తాయి. నీవు మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ "వంచన సహజము వ్యాపారమందు
61 అందుకే తగదని" అన పాడికాదు
నడుపరాక 'బండి' నయమౌనె తిట్టు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! వ్యాపారస్తులలో నమ్మదగ్గవారూ, నమ్మదగని వారూ ఉంటారు. నమ్మి వాళ్ళ వలన చెడిపోయిన వారూ ఉంటారు. నమ్మక సరిఅయిన

సమయంలో సరి అయిన వాళ్ళ సలహాలు సహాయమూ తీసుకోక చెడిపోయిన వారూ ఉంటారు. అంత మాత్రం చేత వ్యాపారమే చెడ్డదనటం ఎప్పుడో ప్రమాదం జరుగుతుందేమోనని, వాహనం ఎక్కటం మానుట వంటిది. ఈమాట నిజం నీ సాక్షిగ.

మం॥ అతి వృష్టిలో తాను అప్రమత్తుండు
62 అవక నేడ్చిన మేలు అవునా, చివరకు
చేదాల్తురే ఆకుచేయి కాలాక?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! అతివృష్టి వల్ల వరదలు వచ్చి ఇళ్ళు కూలి పంటలు నాశనమయి సర్వం పోగొట్టుకుని ప్రాణ నష్టం కూడా జరుగుతుంది. అప్పుడు జాగ్రత్త చాలా అవసరం. (దైవ కృప ఎలాగూ అవసరమే). ఆ విధంగా ముందు జాగ్రత్త లేక చివరికి ఏడిస్తే ఏం లాభం. చేతులు కాలకుండా ఆకులు పట్టుకోవాలి కానీ చేతులు కాలిన తర్వాత ఏం లాభం. మాకు నీవే నయ్యా మాకు సద్బోధకుడవు.



మం॥ ఎరుగని వారితో ఎకసెక్కమైన
63 ఎరుగని తావున కేగుట యైన
పురుగుని తేలని ముట్టుటేయగును
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! మనకి తెలియని వారితో పరాచికాలు చేయరాదు. బొత్తిగా తెలియని చోట నివసించరాదు. తేలుని పురుగు అని భ్రమించి ముట్టుకున్నట్లే అగును. నీవే మాకు సద్బోధ చేయువాడవు.

మం॥ నోట దాచగలేదు 'నువుగింజ' నాతి
64 పురుషుడట్లుండిన పురుగౌట నిజము
అమ్మగనుక ఆమెననరాదు మాట
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ స్త్రీలు రహస్యం దాచలేరని ప్రతీతి. అందుకనే వారి నోటిలో 'నువ్వు గింజ' కూడా నానదు అని అంటారు. నువ్వుగింజ, తడిసేటంత సేపుకూడా దాన్ని దాచలేక మాట్లాడి బయటపడేస్తారని చలోక్తి. వారు అట్లా



చేసినా 'అమ్మ' కాబట్టి క్షమించవచ్చు. కానీ పురుషుడు అట్లా రహస్యం దాచలేని వాడైతే హీనంగా పురుగులా భావించబడి మర్యాద కోల్పోతాడు. సద్బోధ జరిపే సత్యసాయీ ఇది సత్యం.

మం॥ పిలువక పోరాదు పేరంటమునకు
65 పిలిచిన మానుట విపరీతమగును
యోచించి మెలగుట ఉత్తమంబగును
సత్యసాయీ నీవె సద్బోధకుడవు

తా॥ ఓ సత్యసాయీ! అమ్మా పేరంటానికి తప్పకుండా రా అని పిలువకుండా ఎప్పుడూ పోరాదు. అదే విధంగా మర్యాదగా పిలిచినప్పుడు పోకుండా మానటం కూడా అమర్యాద అవుతుంది. ఈ విధంగా ఏది ఎప్పుడు చేయాలో ఆలోచించి చేయుట ఉత్తమం. నీవే సద్బోధకుడవు.



మం॥ ఆలితోటి, తనదు అధికారి తోటి
66 మెలగ నేర్వని వాడు, మేటి కాడెపుడు
అందకుండా 'జీను' హయము నెక్కుటయె
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ సద్బోధకుడివే ఓ సత్యసాయీ! భార్యతోటి మెలగుట తెలియని వాడు, తన పై అధికారితో ఎట్లా నడుచుకోవాలో తెలియని వాడు వ్యర్థులు. మంచి మేలు జాతి గుర్రంపై కూడా 'జీను' అందకపోతే సరిగా కూర్చోలేక జారి పడిపోతాడు.

మం॥ తప్పని తెలిసి వాదము జేయువాని
67 వాద్యము శృతిలేక వాయించువాని
దవ్వుననుంచుట తగునది మేలు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ సద్బోధకుడివగు ఓ సత్యసాయీ! తన తప్పు తెలిసి ఒప్పని వాదించే వానిని, శృతిలేకుండా వాద్యము వాయించేవానిని దూరంగా ఉంచడం చాలా మంచి పని. లేకపోతే తలనొప్పి తెప్పిస్తారు.

మం॥ భయము జెందెడి యోధ వ్యర్థుండు అనిలో
భయమెరుంగనిద్దైన పతివ్రత చెడును
భయమెంత చెడ్డదో మంచిదీ అదియె
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ భయపడే యోధుడు వ్యర్థుడు. పతివ్రతయైన స్త్రీ కూడ భయములేక చెడిపోతుంది. భయం ఎంత చెడ్డదో మానవులకు అంత మంచిది కూడా అదే. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ జరుపు గురుమూర్తివి.



మం॥ వేద వేదాంగముల్ విరివిగా జదివి
69 బ్రహ్మను తెలియుట వశమౌనె? కాదు
గడ్డిమేటన్ సూది కనలేని యట్లు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ వేదవేదాంగములు పేరుపొందునట్లు చదివినంత మాత్రముచేత బ్రహ్మజ్ఞానము పొందుట సాధ్యమా? ఎంతమాత్రమూ కాదు. గడ్డిమేటలో చిన్నసూదిని వెతికి పట్టుకోలేము కదా. ఓ సత్యసాయీ నీవే మాకు సద్బోధచేయు గురువు.

మం॥ పొదుపు లేనట్టి స్త్రీ పురుషుల బ్రతుకు
70 దుర్భరంబై పోవుతోపక శాంతి
చిల్లుపడిన నావ చేర్చునా దరిని?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ పొదుపు చేయగల నేర్పరులు కాని స్త్రీ పురుషుల బ్రతుకు దుర్భరం అవుతుంది. చిల్లుపడిన పడవలో ప్రయాణం చేస్తే ఒడ్డు చేరటం సాధ్యంకాని పనీ ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయగలవు.

మం॥ వేము తియ్యదనము వెలయాలి నీతి
71 కనుగొన వీలౌనె గాలించు భువిని?
వితరణ నెరుగునా వెర్రివాడెపుడు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ వేపచెట్టు తీపినీయటం, వెలయాలు ప్రేమ పొందటం గాలించి వెదికినా దొరికేవి కావు. పిచ్చివాడు ఏది మంచో, ఏది చెడో తెలుసుకునే విచక్షణ కలిగి ఉంటాడా? ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.



మం॥ అవసరాలకు జేరు అర్థుల ప్రేమ
72 నిజమట్లు కనిపించు నిలువ నీయదుగ
పూలపై తుమ్మెదకుండునా వలపు?
సత్యసాయి నీవె సద్బోధకుడవు.

తా॥ మనవద్దకు అవసరాలకోసం చేరునటువంటి అర్థులు చూపించే ప్రేమ నిజమైనదిలా కనిపించినా నిజంకాదు. మనలని అహంకారులను చేస్తుంది. పూబాలలమీద తుమ్మెదకు ప్రేమ మకరందం తాగేటంత వరకే. అది నిజమైనది కాదు. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయగలవు.

మం॥ తనవారు లేకున్న ధనరాసులేల?
73 కొనువాడు లేకున్న కొండంత పసిడి
యుండి లాభంబేమి యుర్విలో ప్రజకు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ నా అనే వారు లేని వానికి ధనరాసులెన్ని ఉన్నా నిరుపయోగం. కొనేవాళ్ళుంటేనే బంగారానికి విలువ. లేకపోతే బంగారం కొండ ఉంటే మాత్రం లాభం ఏమిటి? ప్రజలకు అట్టి సంపదవల్ల ఉపయోగం లేదు. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయగల గురుమూర్తివి.

మం॥ ధనము లేనప్పుడు దరిరారు హితులు
74 పదవి బోవగ రాడు బంధువెవ్వడును
ముసలి గుర్రాన్నెవడు ముద్దుగ బెంచు?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ డబ్బు లేకపోతే స్నేహితుడు ఎవ్వడూ దగ్గిరకు కూడా రాడు. ఉన్న పదవి పోతే బంధువులమని చెప్పుకునేవాడెవడు దగ్గిరకు రాడు. బలంగా ఉండే వయసు పదునుమీద ఉన్న గుర్రాన్ని మేతబెట్టి పెంచుతారు గానీ ముసలి గుర్రాన్ని ఎవడు ముద్దుజేసి పెంచుతారు? సత్యసాయీ ఇది మనిషి నైజం. నీవు సద్బోధ చేయు గురుడవు.



మం॥ అప్రమత్తుడు తాను అవని మానవుని
75 చీకాకు బెట్టును చిరుకష్టమైన
చిన్న చీమలు కుట్టి చెరుపవా నిదుర
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! సావధానుడుగాని మనిషిని చిన్న కష్టమైనప్పటికీ మనసును నిలువ నీయదు. మనిషిని చాలా చీకాకు పెడుతుంది. చిన్న చీమలు కుట్టి నిద్ర పాడు చేస్తాయి. నీకంటే సద్బోధకు డెవరు.

మం॥ పెదవి దాటగ రాదు పేదకు పలుకు
76 పడతి చెప్పగ రాదు వలపును పైకి
చేసిన ఆతీరు చిన్నబోయెదరు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ పేదవానికోసం దాగివుండాలి కానీ పెదవి దాటి బయటకు వస్తే చాలా కష్టాలు పడతాడు స్త్రీ తన ప్రేమను పరోక్షంగా తెలియ జేయాలి. గాని సిగ్గువిడిచి బయటకు చెప్పకూడదు. ఆ పనిచేస్తే తప్పకుండా అవమానించబడతారు. ఓ సత్యసాయీ! నీవు మాకు సద్బోధ చేయు గురుడవు.

మం॥ భక్తి వీడిన పూజ ఫలితంబునీదు
77 రక్తివీడిన సేవ లాభంబు లేదు
తీగ తెగిన వీణ తెచ్చునా ముదము?
సత్యసాయీ! నీవె సద్బోధకుడవు.

తా॥ భక్తిలేని పూజవల్ల ఏం లాభం? రక్తిలేని సేవకుడు నిరుపయోగమే. తీగ తెగిన వీణ ఆనందం ఎలా ఇస్తుంది. ఎప్పటికీ కలిగించలేదు. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.



మం॥ ఆడి తప్పెడివాని నడుగుట తగదు
78 కొరజూచువానిని కూడుట తగదు
నీతిలేని నరుని నీడయే హాని
సత్యసాయీ! నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఆడినమాట తప్పెడి వానిని ఎన్నడూ సహాయం అడుగరాదు. తక్కువగా చూచేవానిని ఎన్నడు జత కలువరాదు. ఏ మనిషికి నీతి వుండదో వాని నీడకూడా మనమీద పడకూడదు. నీవే మాకెల్లరకూ సద్బోధ చేయు గురుడవు.

మం॥ కూడబెట్టిన సొమ్ము కొడుకుల పాలు
79 బాగుచేయని భూమి పరులకు మేలు
చేసిన మంచియే చివర నాపాలు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! మనిషి జీవితకాలమంతా ధనం కూడబెట్టి కొడుకులకిచ్చి చనిపోతాడు. మా పొలం బాగుచేసుకోకుండా వ్యర్ధంగా వుంచితే అన్యాక్రాంత మవుతుంది. మరి మనిషికి మిగిలేదేమిటి? వాడు చేసిన మంచి మాత్రమే నీవు మాకు సద్బోధ జరుపు గురుడవు.

మం॥ చింకి గుడ్డలు కట్టి చిప్పలో గుడిచి
80 వేలు కూడగబెట్టు వెర్రి మానవుడు
కాటికి కాల్జాపి గఱపడు మంచి
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! వెర్రి మానవుడు చిరిగిన బట్టలు కట్టి, చిప్పకూడు తిని వేల ధనం కూడబెట్టి చనిపోయే స్థితి కొచ్చి కూడా ఏమాత్రం మంచి చేయడు. అనాది నుంచి ఇదే జరుగుతున్నది. నీవే సద్బోధ జరుపగలవు.



మం॥ కనకంబు నాణ్యత కనుగొన గలుగు
81 కంసాలి యొక్కడే కరిగించి దాని
భక్తు నిజాయితీ పరమాత్మ యెరుగు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ బంగారం యొక్క వన్నెను కేవలం కంసాలి యొక్కడే తెలిసి యుంటాడు. పరమాత్మ కొక్కడికే భక్తుని నిజాయితీ తెలుస్తుంది. ఓ సత్యసాయీ! నీవె మాకు సద్బోధకుడవు.

మం॥ దానంబు జేయక దరిరాదు ధనము
82 మంచిని జేయక మంచెట్లు జరుగు
దైవ చింతన లేక దరిరాదు శాంతి
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ మనిషికి తెలియని కిటుకేమిటంటే ధనం కావాలంటే ధనం దానం చేయాలి. నీవు మంచి చేయకుండా (నీకు) మంచి జరుగదు. దైవ ధ్యానం చేయని వారికి శాంతి కలుగదు. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయగలవు.

మం॥ తానతందాననే 'తనవారి' నడుమ
83 కాలమెల్ల గడిపి కానడు నిజము
బలము తగ్గినయంత 'భజ' నాగిపోవు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ తాను చెప్పిన ప్రతిదానికి 'తాన అంటే తందాన' అని తాళం వేసే ఉబ్బుడు గాళ్ళు' మధ్య కాలమంతా గడుపుచూ, మనిషి నిజము 'చూడలేనంత' పొగరుతో ఉంటాడు. ఆ బలం (అధికారం) పోయాక ఆ భజనగాళ్ళు కూడా మాయమైపోతారు. ఓ సత్యసాయీ! నీవే సద్బోధకుడవు.



మం॥ 'అండ' జూచి మురిసి అన్నింటి మరచి
84 పరుల కించపరచి బాధించ రాదు
పాలపళ్ళెన్నాళ్ళు పాపాయి తోడు?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ మనకు ఇవాళ అండ (సపోర్ట్) ఉందని దాన్ని చూసుకుని అంతా మరచిపోయి కన్ను మిన్ను గానక ఇతరులని అవమానించి బాధించడం చాలా తప్పు పని. పిల్లలకి పాలదంతాలు రాగానే తమ ప్రతాపం చూపటానికి కొరుకుతారు. కానీ ఆ పళ్ళు మధ్యలోనే పోయి బోసినోరు చేస్తాయి. ఓ సత్యసాయీ! నీవే మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.

మం॥ భజన చేయదగును భక్తి జూపుటకు,
85 పరులను గోలచే బాధించరాదు
దేవుని వారిచే తిట్టించ తగునె?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! మనిషి భక్తి కలుగుటకు భజన చేయుట సులభమైన మార్గమే, కాని ఆ భజనవల్ల ఇతరులకు ఏ మాత్రమూ బాధ కలుగజేయరాదు. అట్లా బాధిస్తే వారు విసిగి మనం నమ్మే దేవునే నిందిస్తారు. అలా చేసినందువల్ల జరిగేది దైవ నింద అగుటచే మంచిది కాదు. మన స్వస్థలములో నిగూఢముగా భజన చేయుటే ఉత్తమము. నీవు మాకు సద్బోధ చేయగల గురుడవు.

మం॥ కుందేటి ముందరే కోపించు నక్క
86 పులియెదురవ తోక ముడుచుక పోవు
వేదించు క్రూరుడు పిరికినే జగతి
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! నక్క జిత్తులమారి. కానీ పిరికి జంతువు. దాని ప్రతాపమంతా ఇంకొ పిరికిదయిన కుందేటి ఎదురుగానే, పులి ఎదురైతే పారిపోతుంది. అదే విధంగా దుర్మార్గుడు పిరికివాడినే భయపెట్టి, బాధించ గలడు. ధైర్యస్థుడిని ఏమీ చేయలేడు. మాకు సద్బోధ చేయగల గురుమూర్తివి.



మం॥ చెడుని నిర్మూలించి శిక్షించు నెడల
87 అధికారి క్రూరుడై అమలు జేయాలి
వేలు వంకర లేక వెలిరాదు 'నేయి'
సత్యసాయి నీవె సద్బోధకుడవు.

తా॥ అధికారి అయినవాడు చెడును నిర్మూలించుటకు చెడ్డవారిని శిక్షించాలి. ఆ సమయంలో జాలి లేకుండా క్రూరంగా శిక్షించాలి. నెయ్యిని పాత్రలోంచి తీయవలెనంటే వేలు వంకరగా వుంచాలి. అలా చేస్తేనే కాని నెయ్యి బయటకు రాదు. ఓ సత్యసాయీ! నీవు మాకు సద్బోధ చేయగల గురుడవు.

మం॥ అతి నవ్వు వనితకు హానియౌ, తప్పు
88 ఏడ్చేటి మొగవాని ఇల నమ్మరాదు
నీతి జెప్పిడి పులి నిక్కమే అవని?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ స్త్రీ అనవసరంగా నవ్వదు. అందులో కూడా పరాయివారి ముందు అసలే నవ్వదు. కేవలం తన అవసరానికే నవ్వుతుంది. అలాగే మగవాడు ఏడవటం అనవసరంగా జరుగదు. ఒకవేళ పులి మాటలు నేర్చి నీతివాక్యాలు చెప్పినంతనే దాన్ని నమ్మి దాని దగ్గరకి వస్తే అది తినివేస్తుంది కదా ఓ సత్యసాయీ! నువ్వే మాకు సద్బోధకుడవు.

మం॥ చెడు విన గోరెడి చెవులకు శోభ
89 రత్నకుండలములు రప్పించ గలవె?
పాచి అన్నముపైన పన్నీరువోలె
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఎప్పుడు చెడు మాటలు వినగోరె చెవులకు రత్నకుండలాలు (దిద్దులు) అందం తెప్పించలేవు. పాచిపోయిన అన్నం మీద పన్నీరు చిలకరిస్తే బాగవుతుందా? నిన్ను మించిన సద్బోధ జరుపగల వారు లేరు.



మం॥ మితిలేని గర్వంబు, మించు క్రోధంబు
90 తగవయ్య! గర్వంబు తగ్గించు మైత్రి
తరగని కోపము తనకేయౌ హాని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! (కోపం, గర్వం మనిషికి సహజ మైననూ దానికి మితి ఉండాలి. వానిని నిర్మూలించినవాడు సర్వోత్తముడు) మితిలేని గర్వం స్నేహితులను దూరం చేసి తగ్గిస్తుంది. ఇక తగ్గించుకోలేని కోపం (తననే దూరం చేసి) తననే చంపి తనకే హాని చేస్తుంది. నీవే సద్బోధకుడవు.

మం॥ తొందరగా బోదు దుష్టుని మైత్రి
91 మాయరోగంబట్లు మరణించుదాక
వ్యసనమబ్బును గాని వదలదు నరుని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! చెడ్డవాళ్ళతో ఒకసారి స్నేహం చేస్తే పట్టుకుని ఇక వదలదు. అంటు వ్యాధిలాగా చచ్చేదాకా తోడుంటుంది. అట్లే వ్యసనం ఒకసారి తోడైతే మానవుణ్ణి ఇక వదలదు. (పైగా ఎన్నో చెడ్డపనులను చేయిస్తుంది. మానవాళికి సాక్షీభూతుడవై నిలిచి సాయం చేయి ప్రభూ)

మం॥ 'తప్పు ఆలిని యొడ్డ' ధర్మజుండెరుగు
92 'బంగరులేడేది? మైదిలి యెరుగు
విధి వ్రాతచే బుట్టు విపరీత బుద్ధి
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! వినగా (ఇది నిజం) పాడయి పోయే ముందు మనిషికి అసహజమైన యోచనలు వచ్చుట జరుగును. (ధర్మరాజు వంటి జ్ఞానికి జూదంలో భార్యని పందెంగా పెట్టుట పాపమని తెలియదా? సీతకు బంగారు లేడి సృష్టిలో లేదని తెలియదా? నువ్వేకదా మా సాక్షివి.



మం॥ ఇంట దీపము బెట్ట ఇల్లంత వెలుగు
93 వీధిలో వారికి వెలుగు సాయమగు
చేసిన 'మంచియే' సేమమందరికి
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఇంట్లో దీపం వెలిగించినచో, తనవారు పరులను బేధము లేకుండా అందరికి వెలుగిస్తుంది. ఆ విధంగా మానవుడు చేసిన మంచి మాత్రమే అతనికీ, అందరికీ క్షేమమవుతుంది. అందుకనే నువ్వు మాత్రమే సద్బోధ చేయగలవు.

మం॥ 'జీను' ధరింపగా జేయ గార్ధభము
94 అశ్వంబు కాబోదు, అట్లె మూర్ఖుండు
దాల్చి కిరీటంబు తానౌనె రాజు?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ గాడిదను అలంకరించి చక్కటి 'జీను' ధరింప చేసినంత మాత్రాన గుర్రం కాదు. మందమతియైన మూర్ఖుడు నెత్తిన కిరీటం ధరించగానే భూమిని పాలించే రాజవుతాడా? ఓ సత్యసాయి నీ సాక్షిగా కాదు.

మం॥ ఇండ్లను దహియించు, ఇంతుల జెరచ
95 ఊరికి చెడుజేయు నూరకేపోదు
విడని పాపాలవి వేయి జన్మలకు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! ఇళ్ళు (ఖాళీ చేయించటం లాంటి స్వార్ధం కోసం) తగుల బెట్టించటం పర స్త్రీలను చెరచుట, ఉన్న ఊరికి అపకారం చేయటం వంటివి వెయ్యి జన్మలకైన వదలని పాపాలు. (అందుచేత చేయరాదు) నీవే సద్బోధకుడవు.



మం॥ పులిననుకరించ బోయిన నక్క
96 కోరి వాతలు బెట్టుకొనినచో జచ్చు
ఘనుని ననుకరించ గలడె హీనుండు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! పులిలాగ కనబడాలని నక్క తన ఒళ్ళంతా వాతలు పెట్టుకుంటే వాతం కమ్మి చస్తుంది. వినగా, అదే విధంగా గొప్పవాడిని పాపాత్ముడు అనుకరిస్తె భంగపడతాడు. అనగా గొప్పవారిని గుడ్డిగా అనుకరించకుండా మనస్ఫూర్తిగా అనుసరించాలి. నీవు మాకెల్ల సద్బోధకుడవు.

మం॥ పాండిత్యమును జూపు పాట్లెంతొ ముప్పు
97 నానా విధంబుల నగుబాట్లు కలుగు
కోకిలమ్మను జూచి కాకి పాడుటయె
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ మనిషి ఏ గొప్పతనం లేనప్పుడే డాబుగా వుండటానికి ప్రయత్నించి నవ్వుల పాలవుతాడు. నానా బాధలు పడతాడు. (అన్నీ తెలిసిన గొప్పవాడు వినయంగా ఉంటాడు) కోకిలవలె పాడాలని కాకి గొంతు విప్పినట్లుంటుంది. ఓ సత్యసాయీ! నీవు మా కందరికీ సద్బోధ జరుప గురుమూర్తివి.

మం॥ పాత్ర కడుగకుండ వంటయే హాని
98 బాగుచేయని యింట బండుట హాని
తెలియని వాటిని తినుటయే హాని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! వంట పాత్ర చక్కగా కడుగ కుండా వంటచేయుట ప్రమాదం. ఊడ్చి, తుడిచి శుభ్రం చేయని ఇంట్లో పడుకోవటం హానికరం. ఏది ఐడితే అది దాని గురించి తెలియనప్పుడు తినరాదు. ప్రమాదం కలుగుతుంది. నీవు మాకు సద్బోధ చేయు గురుమూర్తివి.



మం॥ అతి వినయము జూపు ఆగంతకులను
99 నమ్మరాదెన్నడున్ నష్టంబు కలుగును
తేనె పూసిన కత్తి తెంచదా మెడను
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! అతి వినయం చూపు నూతన పరిచయస్థుని, నమ్మకూడదు. చివరకు దుఃఖం కలిగిస్తుంది. తేనె బాగా పట్టించిన కత్తితొ మెడను కోస్తే మెడతెగకుండా ఉంటుందా? అనగా మనిషికి వినయం ఉండాలి కానీ అతి వినయం పనికి రాదు. సాక్షీభూతుడవు మాకందరికీ నీవే సద్బోధ జరుప గురుడవు.

మం॥ కన్నీరు బెట్టిన కరుగునా జముడు
100 శాంతులు చేయించ శాంతి కల్గేన?
ఉంగరాల వలన ఉపయోగ మౌనె?
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ! ఏడిస్తె యముడు కరుణించి చావుని తప్పిస్తాడా! శాంతి హోమాలు చేయించినంత మాత్రాన మంచి జరుగుతుందా? ఉంగరాలు (నవరత్నాలు అమర్చి) ధరించినంత మాత్రం చేత ఏమి ప్రయోజనం. అంతా భ్రమ. విధి నిర్ణయం ఒక ఉంగరం మార్చగలిగితే ఏ ధనికుడూ చావడు. ప్రభూ నీవు మాకు సద్బోధ జరుపు గురుడవు.

మం॥ రాజుల యుద్ధాలు రవ్వంతయైన
101 శాంతినీయవు జనుల్ చత్తురు, గాని
ఇల, పిల్లి చెలగాట మెలుకకు హాని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ రాజులు (దేశాధినేతలు) చేసే యుద్ధాలు శాంతిని కలిగించవు. ప్రజలంతా మరణిస్తారు. (అవిటితనంతో దరిద్రంతో బాధలు పడతారు) పిల్లికి ఆట ఎలుకకు ప్రాణ సంకటం అయి బాధిస్తుంది. ఓ సత్యసాయీ నీవు అందరికీ సద్బోధకుడవు.



మం॥ అన్ని నేర్చినవాడు అణకువనుండు
102 మిడిసిపాటున మించి మెలగును చవట
ఒట్టి విస్తరి గాలికుండునే నిలిచి
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! అన్నీ తెలిసిన వాడు నమ్రతతో ఉంటాడు. ఏమీ తెలియని మూర్ఖుడు అన్నీ తెలిసిన వాడిలా మిడిసి పడుతుంటాడు. ఏమీలేని విస్తరి ఎగిరెగిరి పడుట సహజమే. అన్నీ వడ్డించిన విస్తరి స్థిరంగా వుంటుంది. నువ్వు మాకు సద్బోధ జరుపు గురుమూర్తివి.

మం॥ ధనము లేదని ఏడ్పు, ధనము పోయేనా?
103 అని ఏడ్పు నరులకు, అట్టియా సిరికి
వ్యామోహ పడుటెంత అవివేకమయ్య
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఈ ప్రపంచంలో మనిషి ధనం లేదని ఏడుస్తాడు. ధనముంటే పోతుందేమోనని ఏడుస్తాడు. మనుష్యులు అటువంటి ధనం కోసం ఏడవడం వ్యామోహ పడడం ఎంత అవివేకం. ఓసత్యసాయీ! నీవె మాకు సద్బోధ జరుపు గురుమూర్తివి.

మం॥ తప్పులన్నియు జేసి దాచెడివారు
104 చెరుతురు పరులను చెడుదురు తాము
కుంతి చేసిన తప్పు గూల్చెనందరిని
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! తప్పుని తెలిసీ తమ తప్పును దాచేవారు ఒకరోజు ఇతరులను చెడగొడతారు. తామూ చెడిపోతారు. కుంతీదేవి తెలియక తప్పు చేసినా తెలిసి తప్పును దాచుట వలననే కదా తను పుత్రశోకం పొంది ఇతరులకూ అదే గతి తెచ్చింది. నీవు మాకు సద్బోధకుడవు.



మం॥ శక్తి పోయిన వాని సాయంబు రారు
105 ఎదురైన మొగమును యిటు తిప్పుతారు
వాడిన పూల నేవనిత ధరించు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! బలం తగ్గిపోయిన వాడికి ఎవరూ సాయం చేయరు. ఒకవేళ దారిలో ఎదురైతే మొగం చాటు చేస్తారు. అది సహజమే వింతేముంది? వాడిన పూలను ఏ స్త్రీ తలలో పెట్టుకుంటుంది? ఓ ప్రభూ ఇటువంటి కఠిన నిజములకు నీవే సద్బోధకుడవు.

మం॥ భక్తి లేకున్నచో పరమాత్మయైన
106 సాయమే విధి జేయు? సాధ్యంబు కాదు
చితుకులు లేనిచో చేయ వంటెట్లు
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.



తా॥ ఓ సత్యసాయీ! భక్తి లేనివాడికి పరమాత్మ కూడ సాయం చేయలేడు. కట్టె పుల్లలు లేకుండా వంట చేయుట సాధ్యమా? నీవే మాకు సద్బోధకుడవు.

మం॥ గురువుతానౌ బ్రహ్మ గురువెగా విష్ణు
107 గురువె ఈశ్వరుడును, గురువు తానగును
పరబ్రహ్మ సాక్షాత్తు వందనంబయ్య
సత్యసాయీ నీవె సద్బోధకుడవు.

తా॥ ఓ సత్యసాయీ! గురువు తనే బ్రహ్మ విష్ణు మహేశ్వరులవంటివాడు. ఆ గురువే సాక్షాత్తూ పరబ్రహ్మ కూడ. అటువంటి గురువుకు నమస్కరించెదను. నీవే సద్బోధకుడవు.



# మంగళం

మం॥ మంగళంబగు గాక మా సత్యసాయి!
108 శతకమ్ముపూర్తయ్యె స్వామి నీకరుణ
మంగళంబగుగాక మానవాళికిని
కొంతైన మంచిని కూర్చువారలకు

తా॥ ఓ సత్యసాయీ! నీకు మంగళమగు గాక ఈ శతకం నీదయవలన పూర్తయింది. మానవులందరికీ మంగళ మగుగాక. చేతనయి నంతలో మంచి చేసిన వారందరికీ మంచి జరుగుగాక.

**Where is Baba!!!**
**He is within us**
**As vision of our Eyes,**
**Strength of our limbs,**
**Power of our speech,**
**Reasoning of our mind and**
**Rhythem of our heart beat.**